క్లుప్తంగా

ప్రత్తిపాడు ఎస్‌ఐగా నరహరి



ప్రత్తిపాడు: మండల నూతన ఎస్‌ఐగా ఎస్. నరహరి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న కె. నాగేంద్ర గుంటూరు నగర పట్టాభిపురం పోలీస్‌స్టేషనుకు బదిలీ కాగా, ఆయన స్థానంలో అక్కడ విధులు నిర్వర్తిస్తున్న నరహరిని ప్రత్తిపాడుకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం స్థానిక స్టేషనులో విధుల్లో చేరారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్‌ఐ తెలిపారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



పొన్నూరు: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి స్వీకరిస్తున్న అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి ఐదు ఫిర్యాదులను తహసీల్దార్ ఇతర అధికారులతో కలసి స్వీకరించారు. వాటిల్లో రెవెన్యూ 4, సర్వేకు సంబంధించిన ఒక అర్జీని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మల్లికార్జునరావు, వ్యవసాయ శాఖ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నన్స్ అరెస్టును ఖండిస్తూ రేపు శాంతి ర్యాలీ



నెహ్రూనగర్: ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ రైల్వే స్టేషన్‌లో సిస్టర్ వందన ఫ్రాంచెస్, సిస్టర్ ప్రీతి మేరీల అక్రమ అరెస్టులను నిరసనగా ఈ నెల 6న నగరంలో శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నట్లు క్రైస్తవ సంఘాల ఐక్యత పరిరక్షణ కమిటీ నాయకులు చెప్పారు. నగరంపాలెంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో సోమవారం శాంతి ర్యాలీ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకూ దేశంలో క్రైస్తవులు, సంఘాలపై దాడులు పెరిగిపోతున్నాయని తెలిపారు. 6న సాయంత్రం 4 గంటలకు ఏసీ కాలేజీ ఎదురుగా ఉన్న సెయింట్ ఆగ్నేస్ చర్చి నుంచి శాంతియుత ర్యాలీ ప్రారంభమై, మూడు బొమ్మల సెంటర్ మీదుగా కలెక్టరేట్ వరకు సాగుతుందని తెలిపారు. ర్యాలీ అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు గాబ్రియేల్, సహదేవ్, నెహెమ్యా, మార్కు, కిరణ్, సౌజన్య, రాజు, విజయ్‌పాల్, వివిధ సంఘాల నాయకులు నల్లపు నీలాంబరం, మద్దు ప్రేమజ్యోతిబాబు, భగత్ సింగ్, జూపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం



గుంటూరు మెడికల్: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని డాక్టర్ శనక్కాయల రాజకుమారి తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవం సందర్భంగా అహల్య హాస్పిటల్‌లో సోమవారం తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రాజకుమారి తల్లిపాల ప్రాముఖ్యత, బిడ్డకు ఎంత అవసరమో వివరించారు. బిడ్డ పుట్టిన మొదటి గంటలో వచ్చే పసుపు రంగులోని చిక్కటి పాలు (ముర్రుపాలు) బిడ్డకు అమృతం లాంటివని వివరించారు. తల్లి పాలు సంపూర్ణ ఆహారమని, బిడ్డకు అవసరమైన అన్ని పోషకాలు ఉంటాయని తెలిపారు. బిడ్డలో వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని తెలిపారు. బిడ్డకు మొదటి ఆరు నెలలు తల్లిపాలే సంపూర్ణ ఆహారమన్నారు. ఆ తరువాత తల్లి పాలతో పాటు అనుబంధ ఆహారం కూడా ఇవ్వాలని సూచించారు. తల్లిపాలు శిశువును న్యుమోనియా, అతిసార వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుంచి కాపాడతాయని తెలిపారు. పిల్లల మేధస్సు ను మెరుగుపరచడంలో సహాయపడతాయని పేర్కొన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణీలు, బాలింతలు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీష, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ కరీమా, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ముర్రుపాలుతో బిడ్డకు ఆరోగ్యం

నెహ్రూనగర్: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఆనందపేట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సూపర్‌వైజర్ పద్మావతి మాట్లాడుతూ ప్రసవం అయిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు ఇవ్వడం ఎంతో ఆరోగ్యమని, ఆరు నెలల వరకు తప్పనిసరిగా ఇవ్వాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మోసాలే ష్యూరిటీ - అబద్ధాలే గ్యారంటీ

- బూటకపు హామీలతో చంద్రబాబు మభ్యపెట్టారు
- వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ
- సుద్దపల్లి, వేజండ్ల గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాలు



వేజండ్లలో కూటమి మోసాలను స్థానికులకు వివరిస్తున్న అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: ఎన్నికల సమయంలో బూటకపు హామీలను ఇచ్చి ప్రజలందరినీ మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఏడాది పాలనలోనే తీవ్రమైన ప్రజా వ్యతిరేకత వచ్చిందని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. చేబ్రోలు మండలంలోని సుద్దపల్లి, వేజండ్ల గ్రామాల్లో సోమవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాలను నిర్వహించారు. రెండు గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ స్థానిక ప్రజలతో కలిసి నేలపై కూర్చొని కూటమి మోసాలపై ప్రజలకు వివరించారు. చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు క్షేత్రస్థాయిలో వివరించారు. క్యూ ఆర్ కోడ్‌తో కూడిన చంద్రబాబు మోసపూరిత మేనిఫెస్టో కరపత్రాలు విడుదల చేశారు. అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల పేరుతో చంద్రబాబు ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇస్తానని చెప్పిన ఆడబిడ్డ నిధి నెలకు రూ.1500లు, అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20వేలు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు భృతి ఏడాది అయిన అందించకుండానే అన్ని ఇచ్చామని మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారని వీడియో చూపించారు. ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే ఆంధ్రాను అమ్మేయాలని చెప్పడం ప్రజలను మోసం చేయటమేనన్నారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, యువకులు ప్రతి వర్గా న్ని మోసం చేయడం కూటమి ప్రభుత్వానికే చెల్లించదన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు, నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ చేస్తున్న మోసాలను ప్రజలు గుర్తించాలన్నారు. టీడీపీ అనుకూల పత్రికలో ఎమ్మెల్యే నరేంద్రకుమార్ అవినీతి, అక్రమాలను ప్రధానంగా ప్రచురించిందన్నారు. మన్నవ గ్రామ సర్పంచ్‌పై టీడీపీ గుండాల దాడి చేయటంపై ప్రజలందరికీ తెలిసిందన్నారు. పేదల మనిషి జగనన్న ఐదేళ్ల పాలనలో ఎన్నికల హామీలను అమలు చేసిన ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జగనన్న ఐదేళ్ల పాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందాయని గుర్తు చేశారు. మోసం అంటే చంద్రబాబు, నమ్మకం అంటే జగన్ అని ప్రజలకు గుర్తుకు వస్తాయన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ అని వివరించారు. ఆయాచోట్ల జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఆళ్ల శ్రీరామిరెడ్డి, నాయకులు కొక్కిలగడ్డ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మంచాల ఎంపీటీసీ కుమారుడుని పరామర్శించిన అంబటి

చేబ్రోలు మండలం తోట్లపాలెం గ్రామానికి చెందిన మంచాల ఎంపీటీసీ సభ్యురాలు తిరువీధుల అంజనాదేవి కుమారుడు సురేష్ అనారోగ్యంతో బాధపడతుండటంతో సోమవారం నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులతో మాట్లాడారు. ఎంపీటీసీ అంజనాదేవితో పాటు వైఎస్సార్ సీపీ అంగన్‌వాడీ నియోజకవర్గ అధ్యక్షురాలు కఠివరపు ఆశాజ్యోతి పాల్గొన్నారు.

వీధి కుక్కలతో ఇక వేగలేం

- వెంటనే ఊరి నుంచి తరలించాలి
- ఘొల్లుమంటున్న బాధితులు
- పెదకాకానిలో పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు



గాయపడిన పిల్లి రత్నాకర్, చేతి చుట్టూ కుక్క కరచిన గాయాలు

పెదకాకాని: వీధి కుక్కల ధాటికి ప్రజలు భయభ్రాంతులకు గురౌతున్నారు. కుక్కలు కరచిన వారు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. పెదకాకాని గ్రామంలో గత కొంతకాలంగా పెదకాకానిలో వీధి కుక్కలు బెడద పుట్టిస్తున్నాయి. గుంటూరు నగరం పెదకాకాని గ్రామానికి సమీపంలో ఉండటం వలన నగరంలో పట్టిన కుక్కలు గ్రామ శివార్లలో వదిలి వెళుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. అవి ఆహారం కోసం గ్రామంలోకి వచ్చి స్థానికుల వెంటపడి దాడి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా వీధికుక్కలు పట్టించాలని అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. పెదకాకాని యువజననగర్‌కు చెందిన పిల్లి రత్నాకర్ ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇటీవల ఇంటికి వచ్చిన ఆయన సోమవారం పిల్లల్ని స్కూల్‌లో దించి ఇంటికి వస్తుండగా ఇంటికి సమీపంలో ఉన్న కుక్క ఒక్కసారిగా ఎగబడి కరవడం మొదలు పెట్టింది. కేకలు వేస్తున్నప్పటికీ నోటితో చేయి పట్టుకుని ప్రక్కనే ఉన్న ముళ్ళ కంపల్లోకి లాక్కెళ్ళింది. ఆ యువకుడి చేతులపై కుక్క పళ్ళ గాట్లు 24 చోట్ల ఉన్నాయంటే ఏ విధంగా దాడి చేసిందో అర్థం చేసుకోవచ్చు. కుక్క కరవడాన్ని తట్టుకోలేక తిరిగి నోటితో కుక్కను కొరికితే అప్పటికి వదిలి పెట్టిందని రత్నాకర్ తెలిపాడు. కుక్క దాడిలో చేతి ఎముకకు దెబ్బతగలడంతో పాటు రక్తస్రావం అవుతుండటంతో బాధితుడిని చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గత శనివారం అదే కుక్క సమీపంలో ఉంటున్న మరో మహిళపై దాడి చేసి చేతిని గాయపరిచింది. గ్రామంలో వీధికుక్కల దాడి ఎక్కువైందని వెంటనే కుక్కలను పట్టించాలని స్థానికులు పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.



మరో బాధితురాలు దుగ్గిరాల



ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

బలసానిని కలిసిన అనుబంధ విభాగాల ఇన్‌చార్జ్



బలసానితో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్‌వలి

గుంటూరు రూరల్: రాష్ట్ర కార్యదర్శి గుంటూరు పల్నాడు జిల్లాల అనుబంధ విభాగాల ఇంచార్జ్ షేక్ మస్తాన్‌వలి ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్‌ను సోమవారం తాడేపల్లి వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జిల్లా మండల అనుబంధ విభాగాల కమిటీల నియామకాలు త్వరగా పూర్తి చేయాలని బలసానిని కోరారు. ఇప్పటికి తాము నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి అనుబంధం విభాగాలు అధ్యక్షులు నియామకాలు పూర్తి చేశామని, త్వరలో జిల్లా, మండల అనుబంధ విభాగాల కమిటీలను కూడా పూర్తి చేస్తానని తెలిపారు.

గుండవరంలో మహిళకు పాముకాటు

గుండవరం (చేబ్రోలు): వ్యవసాయ పనులు చేస్తున్న మహిళను పాము కాటువేయడంతో ఆమె పరిస్థితి విషమంగా ఉన్న సంఘటన చేబ్రోలు మండలం గుండవరం గ్రామంలో సోమవారం జరిగింది. మండలం పరిధిలోని గుండవరం గ్రామానికి చెందిన మక్కే వీరకుమారి వారు సాగు చేస్తున్న చిక్కుడు పందిరి తోటలో పనులు చేస్తోంది. అదే సమయంలో ఆమె చేతిపై పింజేరి పాము కాటు వేసింది. సమీపంలోని మహిళలు గమనించి తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి ఆమెను గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

డిజిటల్ చెల్లింపులపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న బాబురావు, హెచ్ఎం భాస్కరరావు

పెదకాకాని: విద్యార్థులు డిజిటల్ చెల్లింపులు నగదు రహిత లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవీ భాస్కరరావు అన్నారు. మండలంలోని నంబూరు ప్రోలయ వేమన జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం బ్యాంకింగ్ వ్యవస్థలపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ప్రతినిధి (సీఎస్‌పీ) జి.కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకుల విధివిధానాలను తెలుసుకోవాలన్నారు. తప్పనిసరిగా బ్యాంకింగ్ పోల్డర్‌లో చేర్చబడాలన్నారు. ఆర్థిక అక్షరాస్యత కలిగి బ్యాంకింగ్ సేవలను తెలివిగా ఉపయోగించుకోవాలన్నారు. బ్యాంక్ ఉత్పత్తులను ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం బ్యాంకు లావాదేవీలపై వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ బ్యాంక్ ప్రతినిధి ఆర్.పవన్ కుమార్, పాఠశాల ఒకేషనల్ ట్రైనర్ పి.హుస్సేన్, వర్క్‌షాప్ రిసోర్స్ పర్సన్‌లు వై.బాబురావు, ఎం.రామకృష్ణ, పి.రత్నశేఖర్, కె.నరేష్ పాల్గొన్నారు.

వాడుతున్న వరి మొలకలు




వెంకటకృష్ణాపురం శివారులో ఎండ గాలులకు వాడిపోతున్న వరి మొలక



గోళ్ళమూడిలో వరి మొలక దశలో కురిసిన అధిక వర్షాలకు కుళ్లిపోవడంతో రెండవసారి విత్తనం పెట్టిన పొలాలు

- తూలుతున్న అన్నదాత ఆశలు
- అన్నదాతకు ఆదిలోనే సాగునీటి అవస్థలు
- ఆయిల్ ఇంజన్లతో నీళ్లు
- అతివృష్టి, అనావృష్టితో రైతుల అవస్థలు

పెదకాకాని: అన్నదాతలకు ఆరంభంలోనే అవస్థలు మొదలయ్యాయి. ఈ ఏడాది మే నెల చివరివారంలో కురిసిన వర్షాలకు రైతులు ఖరీఫ్ సీజన్ ప్రారంభించలేదు. వరి విత్తనం ఎదపెట్టే దశలో వర్షాలు కురవకుండా పోయాయి. విత్తనం పెట్టే సమయం మించి పోతుండటంతో అన్నదాతలు జూన్ చివరి వారం, జులై నెల మొదటి వారం రోజుల్లో బెట్ట దుక్కుల్లోనే వరణుడు కరుణించకపోతాడా అనే నమ్మకంతో మండలం అంతటా వరి విత్తనాలు ఎదపెట్టారు. పెదకాకాని మండలంలోని నంబూరు, గోళ్ళమూడి, పెదకాకాని, తక్కెళ్ళపాడు, ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం, రామచంద్రపాలెం, తంగెళ్ళమూడి, అనుమర్లపూడి గ్రామాల్లో వరి పంట సాగు సుమారు 16 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. రైతులు విత్తనం ఎదపెట్టిన తరువాత వారం రోజుల పాటు వర్షాలు కురవలేదు. పంట కాలువలకు నీరూ వదల్లేదు. ఆ తరువాత కురిసిన అధిక వర్షాలకు పొలాల్లోకి ఎక్కువగా నీరు చేరి నిలిచిపోవడంతో మొలక దశలో ఉన్న వారి విత్తనాలు నీటిలోనే కుళ్ళిపోయాయి. మెరకగా ఉన్న పొలాల్లో, నీరు నిల్వ లేకుండా చేసిన పొలాల్లో వరి విత్తనం మొలక బాగానే వచ్చింది. విత్తనం కుళ్లిపోయిన పొలాల్లో అక్కడక్కడా మొలక కనిపిస్తూ పైరు చాలీ చాలనట్లు ఉండటంతో రైతులు పొలం ఆరిన తరువాత మళ్ళీ దుక్కులు దున్ని విత్తనాలు రెండవసారి పెడుతున్నారు.



వరి మొలకను కాపాడుకోవడానికి ఆయిల్ ఇంజన్‌లతో నీళ్లు పెడుతున్న రైతులు

వరి మొలక ఎండిపోకుండా ఇంజన్‌లతో నీళ్లు

మండలంలో వరి మొలక వచ్చిన 15 రోజుల నుంచి వరుణుడు మొఖం చాటేశాడు. వర్షాలు లేకపోవడంతో పాటు వేసవి కాలాన్ని తలపిస్తున్న ఎండలు, గాలులకు పొలాల్లో ఉన్న తేమశాతం కూడా తగ్గిపోయి మొలసిన వరి వడబడటం, ఎండిపోతున్నాయి. దీంతో మొలచిన వరి మొక్కను కాపాడుకునేందుకు అన్నదాతలు ఆయిల్ ఇంజన్‌లను ఆరంభంలోనే పొలాలకు తరలిస్తున్నారు. పంట కాలువలకు నీరు వదలడంతో ఆ నీటిని పొలాలకు ఇంజన్ల సాయంతో పెట్టి పంటను కాపాడుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. పంట కాలువలకు దగ్గరలో ఉన్న రైతుల పరిస్థితి ఇలా ఉంటే పంట కాలువలకు దూరంగా ఉన్న పొలాలకు రైతులు తమ దాకా కాలువ నీరు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారు. వరుణదేవుని కరుణకై ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే అన్నదాతల పరిస్థితి వెనుక నుయ్యి ముందు గొయ్యి అన్న చందంగా మారింది. మొలకను కాపాడుకునేందుకే ఆయిల్ ఇంజన్‌లతో నీళ్లు పెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

వెనుకబడిన ప్రాంతాల్లో కమ్యూనిటీ హాల్స్ నిర్మించాలి

నెహ్రూనగర్: తూర్పు నియోజకవర్గ పరిధిలోని అత్యంత వెనుకబడిన ప్రాంతాలైన 53, 54, 55 వార్డుల్లో కమ్యూనిటీ హాల్స్, లైబ్రరీలు, క్రీడా మైదానం ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్ఎస్‌లో నగర అదనపు కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర పరిధిలో శ్మశానవాటికకు స్థలం, నిరుపేద కుటుంబాల పార్థివ దేహాల సందర్శనార్థమై సత్రాలను నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో మణికుమారి, వాసు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో జరిగే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో పాటు నిర్దేశిత గడువు మేరకు పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం హౌసింగ్ బోర్డ్ కాలనీ, నల్లకుంట, ఎన్జీఓ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఏఈల వారీగా రోడ్లపై ప్యాచ్ వర్క్‌లను చేపట్టాలని, హౌసింగ్ బోర్డ్ కాలనీ మామిడి గార్డెన్స్ దగ్గర ఔట్ ఫాల్ డ్రైయిన్‌పై నూతన కల్వర్ట్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీఈఈని ఆదేశించారు. ప్రతి రోజు తాగునీటి సరఫరా జరిగే సమయంలో ఎమినిటీ కార్యదర్శులు తప్పనిసరిగా శ్యాంపిల్స్ తీసి ప్రత్యేకంగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం చుట్టగుంట సెంటర్‌లో రోడ్డు, డ్రైయిన్ ఆక్రమణలను పరిశీలించారు. రెండు రోజుల్లో తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించ వద్దని, నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టం చేశారు. పర్యటనలో డీఈఈ వెంకటరమణ, ఎస్ఎస్ రాజేష్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలం

పొన్నూరు: అంగన్ వాడీ కార్యకర్తలు గత కొన్ని నెలలుగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు విమర్శించారు. సోమవారం పట్టణంలోని సీడీపీఓ కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్ యూనియన్, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి. రమణ మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లు పనిచేయడం లేదని, వాటి వల్ల ఇబ్బందులు పడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వెంటనే పనిచేయని సెల్ ఫోన్లు తీసుకొని కొత్తవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాటిలో ప్రభుత్వ సంబంధిత యాప్‌లు పని చేసేందుకు అవసరమైన నెట్వర్క్ ను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలన్నారు. ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు సుకన్య, మంజుల మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు పడుతున్న ఇబ్బందులను అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు. కార్యక్రమంలో పద్మజ, కృష్ణ, విజయకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఆగి ఉన్న ఆటోను ఢీ కొట్టిన లారీ




మృతి చెందిన రెబ్కా

వేజండ్ల(చేబ్రోలు): ఆటో దిగుతున్న మహిళను అతి వేగంగా వచ్చిన లారీ ఢీ కొట్టడంతో మహిళ మృతి చెందిన సంఘటన చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామ పరిధిలో సోమవారం జరిగింది. వేజండ్ల గ్రామానికి చెందిన జంపని రెబ్కా ఉరఫ్ ప్రశాంతి (27) తెనాలి నుంచి ఆటోలో బయలు దేరి వేజండ్ల అడ్డరోడ్డు వద్ద దిగి డ్రైవర్‌కు డబ్బులు ఇస్తోంది. అదే సమయంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ ఆగి ఉన్న ఆటోను, మహిళను ఢీ కొట్టింది. ఈ సంఘటనలో రెబ్కా తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది సంఘటనా ప్రాంతంలో పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాద సమయంలో ఆటోలో మరో ముగ్గురు ఉన్నప్పటికి వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చేబ్రోలు ఎస్ఐ డి.వెంకట కృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అశ్రద్ధ వద్దు

నగర మేయర్ రవీంద్ర



ఫిర్యాదులను స్వీకరిస్తున్న మేయర్ రవీంద్ర, పక్కన అదనపు కమిషనర్ ఓబులేసు

నెహ్రూనగర్: డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో అందే ఫిర్యాదులపై అశ్రద్ధ వద్దని, ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దేశిత గడువులోగా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర అధికారులకు సూచించారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఛాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్ఎస్‌ను అదనపు కమిషనర్ ఓబులేసు నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి 20 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా మేయర్ అధికారులతో మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లాలని తెలిపారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ ఛాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలని మేయర్ అధికారులకు సూచించారు. ప్రజల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదుల నమోదుకు ప్రతి విభాగంలో సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో సిబ్బందిని కేటాయించి, ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేయాలని తెలిపారు. పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని చెప్పారు. పీజీఆర్ఎస్ ద్వారా 31 ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి- 9, ఇంజినీరింగ్ విభాగానికి- 5, రెవెన్యూ విభాగానికి- 8, ప్రజారోగ్య విభాగానికి- 6, అకౌంట్స్ విభాగానికి -3 చొప్పున ఫిర్యాదులు అందాయని వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు సీహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెహ్రూనగర్: గుంటూరు అర్బన్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలు(ఆయా) పోస్టుల భర్తీకి అర్హులైన మహిళల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ అరుణ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం పరిధిలోని వీవర్స్ కాలనీ, గోరంట్ల పెద బావి, ఆనందపేట, లక్ష్మీ నరసింహపురం, ఎల్‌బీనగర్, వసంతరాయపురం, శారదాకాలనీ, గుంటూరు పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని అంకిరెడ్డిపాలెం, స్వర్ణభారతీనగర్, భాగ్యనగర్, బోసుబొమ్మ, శ్యామలానగర్, శ్రీకృష్ణదేవరాయనగర్ ప్రాంతాల్లో ఆయా పోస్టులు ఖాళీలున్నాయని పేర్కొన్నారు. 7వ తరగతి ఉత్తీర్ణులై 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సున్న మహిళలు ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు గుంటూరు అర్బన్ కార్యాలయం(శ్రీలక్ష్మీ నిలయం, హనుమాన్ నగర్ 6వ లైను, ఏటీ అగ్రహారం)లో దరఖాస్తులు అందజేయాలని ఆమె సూచించారు.

పనిచేయని ఫోన్లు మాకొద్దు!

అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన



అర్బన్ సీడీపీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన

నెహ్రూనగర్: పని చేయని ఫోన్లు తమకు వద్దని, సిగ్నల్ అందక నానా అవస్థలు పడుతున్నామని గుంటూరు అర్బన్ సీడీపీఓ కార్యాలయం వద్ద సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొబైల్ యాప్‌లో లబ్ధిదారుల వివరాలు చెక్ చేసే సమయంలో సర్వర్ పనిచేయకపోవడం, సిగ్నల్ అందక నానా అవస్థలు పడుతున్నామని తెలిపారు. పనిచేయని 2జీ ఫోన్లతో చస్తుంటే మరో పక్క సూపర్‌వైజర్లు పని ఒత్తిడితో మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఈ ఫోన్లతో పని చేయలేమని సీడీపీఓ అరుణకు తేల్చిచెప్పారు. వెంటనే వాటిని వెనక్కి తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం యాప్‌లకు సరిపడా సామర్థ్యం లేకపోవడంతో పనిచేయడం లేదని, వెంటనే 5జీ ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీడీపీఓ తీసుకోకపోవడంతో అక్కడే ఫోన్లు వదిలేసి వెళ్లిపోయారు.